క్లుప్తంగా

దాతల సహకారంతో లబ్ధి

లయన్స్ క్లబ్ షాద్‌నగర్ సేవా సంకల్ప్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి



వాటర్ క్యాన్‌లు అందజేస్తున్న సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు దాతల సహకారంతో మంచి ఉత్తీర్ణతను సాధించాలని లయన్స్‌క్లబ్ షాద్‌నగర్ సేవా సంకల్ప్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని రాంనగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్‌క్లబ్ షాద్‌నగర్ సేవా సంకల్ప్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పెన్నులు, వాటర్ క్యాన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని అన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని రూపొందించుకొని లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలని చెప్పారు. ఏదైనా సాధించాలనే కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది లేదని అన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ షాద్‌నగర్ సేవా సంకల్ప్ సెక్రటరీ లక్ష్మీపతిరెడ్డి, ట్రెజరర్ రాజు, సభ్యులు రాజేష్, వెంకట్‌నాయక్, నరేందర్, ప్రధానోపాధ్యాయుడు సురేష్‌సింగ్, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్ట్‌కార్డు ఆందోళనలో భాగస్వాములు కావాలి

పిలుపునిచ్చిన టీయూడబ్ల్యూజే నాయకులు

షాద్‌నగర్‌రూరల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పోస్ట్ కార్డు ఆందోళన కార్యక్రమంలో జర్నలిస్టులందరూ భాగస్వాములు కావాలని మంగళవారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి పేపర్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ సూచన మేరకు రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెడుతూ సీఎం కేసీఆర్‌కు పోస్ట్ కార్డు రాసే ఆందోళన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించిన జర్నలిస్టులను ప్రభుత్వం విస్మరించడం విచారకరమన్నారు. రాష్ట్ర ఏర్పాటులో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని సీఎం కేసీఆర్ పలుమార్లు ప్రశంసించినప్పటికీ జర్నలిస్టుల సంక్షేమాన్ని మాత్రం విస్మరిస్తున్నారని విమర్శించారు. ప్రధానంగా జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, జర్నలిస్టుల భద్రతకోసం ఏర్పాటు చేసిన జేహెచ్‌ఎస్‌ను పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు.

జీఓ 317తో ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న నేతలు

షాద్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 317తో నష్టపోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని బాధితుల సంఘం డివిజన్ అధ్యక్షుడు ప్రకాష్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత నూతన జిల్లాలలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సర్దుబాటులో భాగంగా ప్రభుత్వం 317 జీఓ తీసుకువచ్చిందన్నారు. స్థానికత పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో జీఓ 317తో ఉద్యోగ, ఉపాధ్యాయులు స్థానికతను కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆరోపించారు. వందల కిలోమీటర్లు దాటి ఇతర జిల్లాలలో పని చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాల కోసం కన్నవారిని, కుటుంబ సభ్యులను వదిలి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 29న ఛలో ఇందిరా పార్కు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. సీఎంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఉద్యోగ, ఉపాధ్యాయ బాధితుల సంఘం నాయకులు మహేందర్‌రెడ్డి, అమరేశ్వర్, సురేఖ, క్రిష్ణవేణి, కవిత, శ్రీనివాస్, శ్రీశైలం, శశి, రాములు, రమేష్, దత్తు, సత్యం, జగన్ ఉన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తప్పనిసరి

జిల్లా సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: కురుస్తున్న వర్షాలతో ప్రజలు తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని జిల్లా సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల జనార్దన్‌రెడ్డి అన్నారు. గత నెల రోజులుగా నగరంలోని జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో కనకమామిడి గ్రామంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. డాక్టర్ లావణ్య చేపట్టిన ఈ నెల రోజుల కార్యక్రమం మంగళవారం ముగిసింది. చివరి రోజు ప్రజలకు ఉచిత వైద్య జనరల్ చెకప్, మందుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో అపోలో ఆస్పత్రి వైద్యుల అధ్యాపకురాలు డాక్టర్ లావణ్య, విశ్వదీప్, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

రైతన్నా.. జర భద్రం

- వానాకాలం.. పాములతో ఫైలం
- ప్రకృతి వైపరీత్యాలు, కరెంట్‌తో పొంచి ఉన్న ప్రమాదాలు
- ఏమరపాటుగా ఉంటే ప్రాణాలకే ముప్పు
- వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తప్పనిసరి



వెంకటేశం

షాబాద్: జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వానాకాలం పంటల సాగు పనులు ఊపందుకున్నాయి. రైతులు, వ్యవసాయకూలీలు బిజీబిజీగా మారారు. పొలం పనుల్లో నిమగ్నమైన రైతులు, కూలీలకు అనుకోకుండా సంభవించే ప్రకృతి వైపరీత్యాలు పిడుగు పాటు, విద్యుత్ విపత్తులు, విష పురుగుల సంచారం, మందుల పిచికారీ వంటి సమయాల్లో రైతన్నలు ప్రమాదాల బారిన పడడంతో పాటు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. అయితే, అన్నదాత అప్రమత్తంగా ఉండి కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను అధిగమించవచ్చని వ్యవసాయ అధికారి వెంకటేశం సూచిస్తున్నారు.



జాగ్రత్తలు

- వర్షాకాలంలో పిడుగులు పడుతుంటాయి. అలాంటి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలి
- ఆకాశం మేఘావృతం అయినప్పుడు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి.
- వర్షంలో పడుతున్నప్పుడు చెట్ల కిందకు వెళ్లొద్దు.. పిడుగులు ఎక్కువగా చెట్లపైనే పడతాయి.
- ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలు ఉన్న ప్రాంతాల్లో ఉండరాదు.
- సెల్‌ఫోన్లు స్విచ్‌ఆఫ్ చేసుకోవాలి.

నడకదారిలో విషసర్పాలు

వర్షాలు కురవగానే పాములు బయటికి వస్తాయి. గట్ల వెంట, చెట్లు, పిచ్చి మొక్కలు, బండరాళ్లు, గడ్డి వాములు ఉన్నచోట పాముల సంచారం ఎక్కువగా ఉంటుంది. రైతులు పొలం పనులకు వెళ్లే సమయంలో ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి.

జాగ్రత్తలు...

- చీకటి సమయాల్లో పూర్తిగా చార్జింగ్ చేసిన టార్చిలైట్ తప్పనిసరిగా తీసుకెళ్లాలి.
- చేతిలో కర్రను పట్టుకుని వెళ్లాలి.
- తప్పనిసరిగా పాదరక్షలు ధరించాలి. బూట్లు ధరిస్తే ఇంకా మంచిది.
- పొలం గట్లపై నడుస్తున్నప్పుడు చప్పుడు చేసుకుంటూ వెళ్లాలి.
- పాము కాటుకు గురైతే తక్షణమే సమీపంలోని ఆస్పత్రిలో చికిత్స పొందాలి.
- నాటు వైద్యంపై ఆధారపడొద్దు.

ఉప్పొంగిన ఈసీ, మూసీ

- మునిగిన పంట పొలాలు
- ఆందోళనలో రైతులు

మొయినాబాద్‌రూరల్: భారీ వర్షాలు కురుస్తుండడంతో ఈసీ, మూసీ వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పంటలు నీట మునిగాయి. మంగళవారం మండలంలోని అమ్డాపూర్ సమీపంలో గల ఈసీవాగు పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తుంది. అలాగే, చిన్న మంగళారం సమీపంలోని మూసీ వాగు నీటి ఉధృతంగా పంటపొలాలను తొక్కుతూ గండిపేట చెరువులోకి చేరుతుంది. వాగులు, వంక లు జలకళ సంతరించుకున్నాయి. రైతులు ప్రభు త్వం తమ పంటలకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.



మొయినాబాద్: ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ



మొయినాబాద్‌రూరల్: నీట మునిగిన గులాబీ తోట

హాస్టల్ సమస్యలను పరిష్కరించాలి

పీడీఎస్‌యూ నేతల డిమాండ్

చేవెళ్ల: ప్రభుత్వ హాస్టల్‌లోని సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శి కె. జైపాల్, శ్రీకాంత్‌లు అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ కళాశాలల వసతిగృహాలు, ఇతర సంక్షేమ వసతిగృహాల్లోని సమస్యలను పరిష్కరించాలన్నారు. అన్ని వసతిగృహాల్లో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయని మండిపడ్డారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మంచి నీరు, మరుగుదొడ్లు కూడా సక్రమంగా లేవని వాపోయారు. అనేక ఇబ్బందుల మధ్య విద్యార్థులు వసతిగృహాల్లో ఉంటున్నారని తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ఎం. సురేశ్ ఉన్నాడు.



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

పొలాల్లో వర్షపునీరు నిల్వ ఉండొద్దు

మండల వ్యవసాయ అధికారులు రమాదేవి, తులసీ



చేవెళ్ల : కౌకుంట్లలో పంట పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

చేవెళ్ల: వర్షాలకు రైతులు పంటలను కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు ఏడీఏ రమాదేవి, ఏఓ తులసీలు తెలిపారు. మండలంలోని తంగడపల్లి, కౌకుంట్ల గ్రామాల్లో అధిక వర్షాల వల్ల పంట పొలాలను ఎలా కాపాడుకోవాలనే అంశాలను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ముందుగా పంట పొలంలో నిల్వ ఉండే నీటిని బయటకు వెళ్లేలా కాలువలు చేసుకోవాలని తెలిపారు. వర్షం ఆగిన తర్వాత 53కిలోల యూరియా, 15కిలోల ఎంఓపీ వేసుకోవాలని సూచించారు. కూరగాయ పంటలకు వర్షాల వల్ల ఆకుమచ్చ, కాండం తెగుళ్లు సోకుతాయని వీటి నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రామాలు, 10 లీటర్ల నీటిలో కలిపి పంటకు పిచికారీ చేసుకోవాలన్నారు. రైతులకు క్లస్టర్ల వారీగా రైతు వేదికల వద్ద మండల వ్యవసాయ విస్తారణ అధికారులు అందుబాటులో ఉంటారని రైతులు వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారి వెంట ఏఈఓ రాజేశ్వర్‌రెడ్డి, ఆయా గ్రామాల రైతులు తదితరులు ఉన్నారు.

జీపీ కార్మికులకు న్యాయం చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

మొయినాబాద్‌రూరల్: పంచాయతీ కార్మికులు తమ డిమాండ్ల సాధనకు 18 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆరోపించారు. మంగళవారం ఆయన సమ్మెలో పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. సీపీఐ, సీపీఎం కార్మికులకు అండగా ఉంటుందని తెలిపారు. మణిపూర్‌లో జరిగిన అమానుష ఘటన మరచిపోలేనిదని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుధాకర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సువాన్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, బీకేయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, ఆయా మండలాల కార్యదర్శులు శ్రీనివాస్, మల్లేష్, సత్తిరెడ్డి, సుధీర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

కేశంపేట: గ్రామ పంచాయతీ కార్మికులు తమ డిమాండ్ల పరిష్కారానికి చేస్తున్న సమ్మె మంగళవారం 19వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, రవి, పారేష్, చంద్రయ్య, పద్మ, అలివేలు, నర్సమ్మ, సాయమ్మ, బాలయ్య పాల్గొన్నారు.



మొయినాబాద్‌రూరల్: కార్మికులతో మాట్లాడుతున్న జంగయ్య

పేదలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్

కొందుర్గు: పేదలను ఆదుకోవడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్ అన్నారు. మంగళవారం ఆయన కొందుర్గు మండల కేంద్రం, చెర్కుపల్లిలో పర్యటించి వర్షాలకు ఇండ్లు దెబ్బతిన్న బాధితులను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని మాయమాటలు చెప్పి, అధికారం చేపట్టాక పట్టించుకోవడం మానేశారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లే ఇప్పటికీ ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఓబీసీ సెల్ షాద్‌నగర్ నియోజకవర్గం చైర్మన్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బీసీ సెల్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నరేందర్, నాయకులు పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, అంజిరెడ్డి, గోవర్ధన్ గౌడ్, మల్లేష్ గౌడ్, ఇసాక్, రవి, రమేష్, యాదయ్య, అశోక్, జిబి కృష్ణ, అమృతయ్య, అనంతయ్య, నర్సింలు, ఆజీమ్, మల్లయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



కొందురు: కూలిన ఇంటిని పరిశీలిస్తున్న శంకర్

బాధితులను ఆదుకోండి

షాద్‌నగర్: ఎడతెరిపి భారీ వర్షాలతో ఇబ్బందులు పడుతున్న నిరుపేదలను ప్రభుత్వం ఆదుకోవాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని మేళ్లబావి తండాకు చెందిన నేనావత్ లక్ష్మి ఇళ్లు కూలిపోయింది. మంగళవారం ఆయన ఆ ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతులు వేసిన పంటలు దెబ్బతిన్నాయన్నారు. మట్టి ఇళ్లు కూలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారులతో దెబ్బతిన్న పంటలను, కూలిన ఇళ్లను సర్వే చేయించి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను నాయక్, రఘు, రఘునాయక్, సత్రు, రమేష్, కృష్ణ, సంజు, బాబు, సంతోష్, రవి, నరేష్, శంకర్ రాజు, హన్యా, సూర్య, లచ్చు, సాయికుమార్, శంకర్, రాజు, గోపాల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పట్టవా?

కొత్తూరు: నిబంధనలు పాటించని పలు క్రషర్ ప్లాంట్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండలంలోని సిద్ధాపూర్ శివారులో గతంలో అనుమతులు పొందిన ఆయా స్టోన్ క్రషర్ల నిర్వాహకులు ప్రస్తుతం పెద్ద ఎత్తున బ్లాస్టింగ్‌లు చేస్తున్నట్లు ఆరోపించారు. బ్లాస్టింగ్‌ల ధాటికి వ్యవసాయ బోర్లు లోపల కూరుకుపోవడంతో పాటు విపరీతమైన దుమ్ము పంటలపై పడి దిగుబడి తగ్గుతుందన్నారు. అలాగే, సమీప ఇళ్ల గోడలకు పగుళ్లు వస్తున్నట్లు తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. సంబంధిత అధికారులు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బడివేళల మార్పు సరికాదు

యూటీఎఫ్ నాయకుడు నర్సింలుగౌడ్

షాద్‌నగర్‌రూరల్: బడివేళల మార్పుపై ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ నాయకుడు నర్సింలుగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని చెప్పారు. ప్రాథమిక పాఠశాలల సమయం ఉ.9:30గంటల నుంచి సా.4:15గంటల వరకు, ప్రాథమికోన్నత పాఠశాలల సమయం ఉ.9:30గంటల నుంచి సా.4:45గంటల వరకు నిర్వహించడం వల్ల విద్యార్థులు ఉ.9 గంటల వరకు ఆడుకుంటూ ఉంటారని, ప్రైవేట్ పాఠశాలల బస్సులు ఉ.7:30 గంటల నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఒకే గ్రామంలోని పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకు ఉదయమే వెళ్లి పోతుండడం, ప్రభుత్వ బడికి వచ్చే పిల్లలు వీధుల్లో ఆడుకుంటుండటంతో చూసే వారికి ప్రభుత్వ విద్యపై నమ్మకం సన్నగిల్లి ప్రైవేట్ బాట పట్టే ప్రమాదం ఉందన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



షాబాద్: సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

షాబాద్: వీఆర్‌ఏలను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం జీఓను విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం షాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు పెంటయ్య మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వీఆర్‌ఏలను క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకోవడంపై కృతజ్ఞతలు తెలిపారు. వీఆర్‌లు రాములు, మల్లేష్, అలవేలు, పద్మ, శేఖర్, వీరంజనేగౌడ్ అంజయ్య తదితరులున్నారు.

కేశంపేటలో..

కేశంపేట: వీఆర్‌ఏలకు రాష్ట్ర ప్రభుత్వం పేస్కేల్ ప్రకటించడంపై మండల వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు జంగయ్య, వీఆర్‌ఏలు మల్లేష్, జంగేష్, శివలీల, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట: క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

మొయినాబాద్‌లో

మొయినాబాద్: వీఆర్‌ఏలను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి పేస్కేలు అమలు చేస్తూ క్రమబద్ధీకరించడంతో మంగళవారం వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్‌కు పాలాభిషేకం చేశారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సమీపంలోని గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు యాదయ్య, అర్జున్, మహేందర్, భరత్, అరుణ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక ప్రభుత్వాలను గద్దె దింపుదాం

కాంగ్రెస్ నేత శ్రీకాంత్‌రెడ్డి

షాద్‌నగర్: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదింపుదామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కందివనం, పుల్చర్లకుంట గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ప్రజలకు మాయ మాటలు చెప్పి ఓట్లు దండుకొని హామీల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

మణిపూర్ ఘటనలకు ఆజ్యం పోసింది బీజేపీనే

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

మొయినాబాద్: మణిపూర్ అమానవీయ ఘటనలకు ఆజ్యం పోసింది బీజేపీనే అని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణిపూర్‌లో జాతుల మధ్య సమస్యను సున్నితంగా పరిష్కరించడంలో బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. మహిళలను వివస్త్రలను చేసి సామూహిక అత్యాచారాలకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గోవులకు ఏమైనా జరిగితే స్పందించే బీజేపీ నాయకులు మహిళలపై అత్యాచారం, హత్యలు జరిగితే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మణిపూర్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, నాయకులు సుభాష్‌రెడ్డి, సత్యనారాయణ, అంజయ్య, సత్తిరెడ్డి, మల్లేష్, సుదీర్, జంగయ్య, నరేష్, జలీల్ పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన

చేవెళ్ల: మహిళలకు రక్షణ కల్పించలేని మణిపూర్‌లోని బీజేపీ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.అరుణ్‌కుమార్, ఎ. శ్రీనివాసు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో మణిపూర్ ఘటనను నిరసిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగింపు చేసినా అక్కడి ప్రభుత్వం ఏమీ చేయలేని పరిస్థితిలో ఉండి పోయిందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఆందోళన కారులను కట్టడి ఎందుకు చేయలేకపోతుందని ప్రశ్నించారు. డబుల్ ఇంజన్‌సర్కార్ ఉన్న కూడా ఏమి చేయలేని బీజేపీ తెలంగాణలో మేము వస్తే అన్ని అభివృద్ధి చేస్తామని చెప్పటాన్ని ప్రజలు ఎలా నమ్ముతారని నిలదీశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూసి మహిళలకు భరోసా కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు యేసు, విఘ్నేష్, సమీర్, కార్కీ, మని, విష్ణు, భవాని, శ్రీవల్లి, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.



మొయినాబాద్: మణిపూర్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

నిరంకుశ పాలనకు తార్కాణం

షాద్‌నగర్: మణిపూర్ అరాచక ఘటనలు బీజేపీ నిరంకుశ పాలనకు తార్కాణం అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు అన్నారు. మణిపూర్ ఘటనలను నిరసిస్తూ మంగళవారం షాద్‌నగర్ పట్టణంలో సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పట్టణ చౌరస్తాలో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ.. మణిపూర్‌ల జాతుల సమస్య ఉధృతమై మహిళలను వివస్త్రలను చేసి అత్యాచారం చేయడం సభ్యసమాజాన్ని తలదించుకునేలా చేసిందన్నారు. దీనికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలన్నారు. మణిపూర్ ప్రభుత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య, నర్సింహ్మరెడ్డి, శ్రీనునాయక్, ఈశ్వర్ నాయక్, గోవింద్ నాయక్, షకీల్, గడ్డం జంగయ్య, చౌహాన్, శ్రీకాంత్, లింగం నాయక్, చంద్రబాబు పాల్గొన్నారు.



షాద్‌నగర్: ప్లకార్డులతో నిరసన

విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం తగదు

తపస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కరించాలని తపస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి కోరారు. మంగళవారం తపస్(టీపీయూఎస్) ఆధ్వర్యంలో తహసీల్దారు గోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించని కారణంగా ఉపాధ్యాయులు మానసిక క్షోభకు గురవుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరితో విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని విమర్శించారు. పలుమార్లు ప్రభుత్వ ఉన్నతాధికారులకు, మంత్రులకు వినతి పత్రాలను ఇవ్వడం జరిగిందని చెప్పారు. అయినా ఎలాంటి పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యం, జిల్లా కార్యవర్గ సభ్యుడు సురేష్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి రత్నారెడ్డి, మండల కోశాధికారి బాలకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు